## సింగిల్ పేజీ కథలు

# చదువు

ఉపాధ్యాయుడు సమాజానికే గురువుగా వుండాలనే ఉన్నతాభిప్రాయం కలిగిన ఉత్తమ వ్యక్తి రంగనాథం మాష్టారు. ఇరవై ఏళ్ళ వృత్తి జీవితంలో వారి శిష్యులెందరో ఉన్నతస్థానాలకెదిగారు. ఇంకెందరో ఉత్తమ పౌరులుగా మన్ననలందుకున్నారు. అలా వారు విద్యాబుద్ధులు సమపాళ్ళలో బోధించి సత్కీర్తి పొందారు.

అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు మారాయి. విద్య మీద అవగాహనగానీ, బోధనతో సంబంధంగానీ లేనివారెందరో ఇందులో వేలుపెడుతున్నారు. తలా తోకాలేని వెర్రి విధానాలతో, ఉన్మాదపు పోకడలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. సమాజంలో పరిస్థితులు కూడా నానాటికీ దిగజారిపోతున్నాయి.

రంగనాథంలాంటి అంకితభావంగల వార్ఖు కూడా ఏమీ చెయ్యలేని, ఏమీ చెప్పలేని దుస్థితి దాపురించింది. బోధన సాగకుండా బోలెడు ఆటంకాలు ఎదురౌతున్నాయి.

రంగనాథం పాఠం మొదలు పెట్టారు.

"పిల్లలూ ఈ చిత్రంలోని వ్యక్తి ఎవరో తెలుసా?" విద్యార్థులను ప్రశ్నించారు.

"గాంధీ తాత సార్" విద్యార్థులు బదులిచ్చారు.

"ఈయనేం చేశాడు?"

"మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడు"

"స్వరాజ్య సాధన కోసం మన నాయకులు బ్రిటిష్ వారితో జరిపిన పోరాటాన్ని జాతీయోద్యమం అంటారు. ఇప్పుడు మనం ఆ పాఠం నేర్చుకుందాం"

ఇంతలో స్కూటర్ శబ్దం.

"ఎవరో వచ్చారు సార్"

"నమస్తే రామనాథంగారు"

"నమస్తే యం.ఆర్.పి. జయరామయ్యగారు రండి కూర్చోండి."

"సార్..ఈ నివేదిక సెట్ సమాచారం '0' నుండి 5 సంవత్సరాలు. 6 నుండి 11 సంవత్సరాలు, 11 నుండి 14 సంవత్సరాలు పిల్లల కులాల వారీ, తరగతివారీ వివరాలు పట్టికలో కోరిన విధంగా మూడేసి కాపీలు సిద్ధం చేసి ఈరోజు సాయంత్రం నాలుగు గంటలలోగా ఆఫీసుకు చేర్చండి. ఇది అత్యవసరంగా భావించండి. దీంతోబాటు గుణాత్మక విద్య 11 రోజుల రిపోర్టు, మధ్యాహ్న భోజన పథకం 15 రోజుల రిపోర్టు, మంత్లీ మానిటరింగ్ సిద్ధం చేయడం మరిచిపోకండి"

"అలాగే సార్"

"పిల్లలూ! తెలుగు పుస్తకంలో నాలుగో పేజీలో గేయం వుంది. దానిని మూడుసార్లు రాసి తీసుకురండి"

ఒక గంట తర్వాత యం.ఆర్.పి. చెప్పిన పని మాష్టారు, మాష్టారు చెప్పిన పని పిల్లలు పూర్తి చేశారు.


"పిల్లలూ! అందరూ రాసేశారుగా ఇప్పుడు పాఠం చెప్పుకుందాం"

"జాతీయ ఉద్యమం నడిపిన నాయకులు బ్రిటిష్ వారి పట్ల అనుసరించిన విధానాన్ని బట్టి దానిని మూడు దశలుగా విభజించారు. మొదటిదశ.."

మళ్లీ స్కూటర్ శబ్దం

"ఎవరో వచ్చారు సార్"

"నమస్తే రామనాథంగారు"



"నమస్తే..మెడికల్ అసిస్టెంట్ గోపాల్‌గారు! రండి కూర్చోండి"

"సార్! మన జిల్లాలో మెదడువాపు వ్యాధి కేసులు రికార్డవుతున్నాయి. ఇవి బెలడోనా మాత్రలు. వీటిని నాలుగు నాలుగు చొప్పున విద్యార్థులకు వేసి, వేయించుకున్న వారి పేరు, తరగతి, వయసు తదితర వివరాలు రాసివ్వండి. ఈలోగా మేం గ్రామంలో తిరిగి వస్తాం"

"అలాగే సార్"

"పిల్లలూ మనం పీల్చేగాలి పాఠంలో నిన్న గుర్తు పెట్టించిన ప్రశ్నలు జవాబులు మీ నోటు పుస్తకంలో రాస్తూ వుండండి. ఈ పనయ్యాక పాఠం చెప్పుకుందాం"

ఓ గంట గడిచాక ఇంటర్వెల్ అనంతరం...

"పిల్లలూ ఇక మనం పాఠం చెప్పుకుందామా"

"జాతీయ ఉద్యమంలోని మొదటి దశకు ఈ చిత్రంలోని మహనీయ వ్యక్తులు నాయకత్వం వహించారు. ఫోటోల కిందనే వారి పేర్లు కూడా వున్నాయి. వారెవరో మీరే చెప్పండి"

"దాదాబాయి నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్‌షా మెహతా"

మళ్లీ స్కూటర్...

"ఎవరో వచ్చారు సార్"

"నమస్తే సార్ రంగనాథంగారు"

"నమస్తే పంచాయితీ కార్యదర్శిగారు. రండి కూర్చోండి మీకేం కావాలి"

"సార్..మీ పేరు, స్వస్థలం, నియామకపు తేదీ తదితర వివరాలు ఈ పట్టిక ప్రకారం ఇవ్వండి. త్వరలో జరుగనున్న నీటి సంఘాల ఎన్నికల నియామకం నిమిత్తం వీటి అవసరం ఎంతైనా వుంది"

"పిల్లలూ మీరు తెలుగు పుస్తకంలోని 97వ పేజీలో 'వినదగు నెవ్వరు చెప్పిన' అను పద్యాలు చదువుతూ వుండండి. ఈలోగా నేనీ పని పూర్తి చేస్తాను"

"అలాగే సార్" అంటూ విద్యార్థులు పనిలో నిమగ్నమయ్యారు.

అరగంట తర్వాత 'అన్నం వచ్చింది సార్' అని గుర్తు చేశారు పిల్లలు.

"బాబూ వెంకటేశ్వర్లు గంటకొట్టు"

భోజనానంతరం మధ్యాహ్నం తరగతులు ప్రారంభమయ్యాయి.

"పిల్లలూ! నిన్న మనం ప్రధాన సంఖ్యల గురించి చెప్పుకున్నాం గదా! బోర్డు మీదున్న ఈ పట్టికలో వంద సంఖ్యలు వున్నాయి. మీరు ఒక్కొక్కరు వచ్చి నేను చెప్పిన పద్ధతిన సంఖ్యలను కొట్టివేయండి. చివరగా ప్రధాన సంఖ్యలు మిగులుతాయి. ఒకటి ప్రధాన సంఖ్య కాదు, సంయుక్త సంఖ్య కాదు. అందుకే 1ని కొట్టివేస్తున్నాను. బాబూ శ్రీరాములు ఇందులో 2 వుంచి మిగతా రెండు గుణిజాలన్నింటిని కొట్టివెయ్"

మళ్లీ స్కూటర్..

"ఎవరో వచ్చారు సార్"

"నమస్తే సార్. నా పేరు వెంకట స్వామి. వ్యవసాయ శాఖనుండి వస్తున్నాను"

"యం.పి.టి.సి. పేరున నిధులు శాంక్షన్ అయ్యాయి. ఇక్కడ యం.పి.టి.సి. సభ్యుడెవరు?"

"నాకూ అయిడియా లేదు సార్" బదులిచ్చాడు రంగనాథం.

"అదేమిటి సార్ అలా అంటారు. మా ఆఫీసరుగారు నన్ను నేరుగా పాఠశాలకు వెళ్ళమన్నారు. విద్యాకమిటీ సభ్యుల, సర్పంచ్, మండలాధ్యక్షులు తదితర పేర్లతో బాటు యం.పి.టి.సి, జడ్.పి.టి.సి. సభ్యుల పేర్లు కూడా చార్టులలో రాసి వేలాడదీసి వుంచుతారన్నారు. పైగా హెడ్మాష్టరును కలిస్తే కావలసిన ఆ వ్యక్తిని పిలిపిస్తాడని కూడా చెప్పారు"

"అలాగే ప్రయత్నిద్దాం! ఒరే చెంచురాజా! నువ్వు పెద్దరెడ్డిగారింటికెళ్ళి ఈ కాగితం చూపి విషయం కనుక్కురా" అని పంపాడు. వాడు తిరిగొచ్చాక కావలసిన సమాచారమిచ్చి ఆయన్ని సాగనంపి తిరిగి పాఠం మొదలు పెట్టారు.

"బాబూ సాయి! ఈ పట్టికలో 3 వుంచి తక్కిన గుణిజాలన్నింటినీ కొట్టివేయి"

"ఓ అయ్యోరా!" బడి ఎదురుగా వున్న మార్కండేయులుదా పిలుపు.

"ఏం మార్కండేయులుగారు ఏం కావాలి"

"మీ బడి పిలకాయలు మా ఇళ్ళలో దూరి పూల మొక్కలు తుంచేస్తున్నారు. వీళ్ళకి మరీ భయం లేకుండాపోతున్నది. మీరు మరీ నెత్తికెక్కించుకుంటున్నారు. పిల్లల్ని కొట్టకపోతే సదువుసాములెలా వస్తాయి చెప్పండి"

"మార్కండేయులుగారూ మా పిల్లలు ఇక మీ ఇళ్ళ ఛాయలకు రారు. నేను జాగ్రత్త తీసుకుంటాను సరేనా" అని సమాధానపరిచారు.

"పెద్దోళ్ళు నేనిట్టా అడిగానని ఏమీ అనుకోమాకండి వస్తా"

అతనలా వెళ్ళాక "అబ్బాయ్ చెంచురాజా ఈ పట్టికలో 5 వుంచి మిగిలిన 5 గుణిజాలన్నింటిని కొట్టివేయ్"

"ఎవర్రా బయటికెళ్ళింది. ఒరే వినోద్ కుమార్ ఇట్రారా వేలెడంత లేవు. నన్నే ఏమార్చి కళ్ళుగప్పి బయటకెళతావా. ఇంకెప్పుడైనా ఇలా చేస్తావా" అంటూ వీపు మీద ఒకటిచ్చాడు. వాడు ఏడుస్తూ బయటకు పరుగుతీశాడు. పెంకి వెధవ మళ్ళీ వస్తాడులెమ్మని రంగనాథం పాఠంలో మునిగిపోయాడు.

"అయ్యోరెక్కడరా! ఎట్టపోయినాడు" అది వినోద్కుమార్ తల్లి సులోచనమ్మ గొంతు.

"ఏమైంది సులోచనమ్మా" అడిగారు రంగనాథం.


"ఆ! ఏమైందా..ఇట్టాగేనా పిల్లల్ని కొట్టేది. నిన్ను చదువు చెప్పమన్నారా చావగొట్టమన్నారా! నీకు పిల్లా పాప లేరా?"

విచిత్రమైన పులుసు విస్తరాకును మింగినట్లు రోజుకో వింత ప్రోగ్రాం వచ్చి చదువులు కుంటుబడి ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. అటు ఊళ్ళో ప్రజలు చిన్న చిన్న విషయాలకు సైతం సర్దుబాటు వీడి సమస్యలు కల్పిస్తున్నారు.

ఈ స్థితిలో బోధన పరమావధిగా భావించే రంగనాథం లాంటి అనేకానేకులు కలుషితమైన విద్యావ్యవస్థతో రాజీ పడలేక, ఇటు విద్యార్థులకు పూర్తి న్యాయం చేయలేక, ఎదిరించే తెగింపు లేక మానసిక క్షోభతో సతమతమౌతున్నారు.

**-చిరమన వెంకట రమణయ్య**
**(గూడూరు)**

# తనదాకా వస్తే...



బాల్కనీలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాడు రామారావు. అతని భార్య విజయ ఇల్లంతా ఊడ్చి చెత్తని ప్లాస్టిక్ బుట్టలో వేసింది. బాల్కనీ దగ్గరకు వచ్చి, మేడమీద నుంచి ఆ బుట్టను క్రిందికి వంచేసింది.

గాలికి కొన్ని కాగితాలు తిరిగి బాల్కనీలోకే వచ్చేసాయి. మిగిలిన చెత్త, తరిగిన కూర ముక్కలు, దుమ్ము రోడ్డు మీద పడింది.

"కొంచెం కిందికి వెళ్ళి చెత్తకుండీలో వేస్తే బాగుంటుందిగా!" అన్నాడు రామారావు.

"మళ్ళీ అదో పని కూడానా! రోడ్డు మీదికి విసిరేస్తే పోయేదానికి. అయినా మెట్లు దిగి క్రిందికి ఎవరు పోతారు?" అంది విజయ.

"ఎవరి నెత్తినైనా పడితేనో!"

"ఎందుకు పడుతుంది? ఏం పడదు. కింద నడిచే వాళ్ళు జాగ్రత్తగా నడవాలి. అయినా అందరూ చేసే పనేగా ఇది!" అంటూ లోపలికి వెళ్ళింది ఆమె.

ఇంక ఆమెతో మాట్లాడి లాభం లేదనుకుని ఊరుకుండిపోయాడు రామారావు.

నాలుగు రోజులు గడిచాయి.

ఆరోజు ఉదయం ఆరున్నర కావస్తోంది.

ఇల్లంతా దేనికోసమో వెతుకుతోంది విజయ.

రామారావు లేచి ముఖం కడుక్కోబోతూ "ఏమిటి వెతుకుతున్నావు?" అని అడిగాడు.

"చంటాడి వెండి ఉగ్గుగిన్నె కనిపించడం లేదండీ. పొద్దున్నే ఉగ్గు కూడా పెట్టాను" అంది విజయ ఆందోళనగా.

"అమ్మా..ప్రొద్దున్న తమ్ముడు దానిని పట్టుకుని పాకుతూ సావిట్లో తిరుగుతుంటే చూశాను. ఒకవేళ నువ్వు చీకట్లో దానిని కూడా ఊడ్చి అవతల పారేశావేమో!" అంది కూతురు లలిత.

"అవునేవ్..అంతే చేసి వుంటాను. ఇందాక ఊడుస్తుంటే ఏదో ఘల్లుమంది కూడాను. ఏ ఇనపముక్కో అనుకున్నాను. నేను క్రిందికిపోయి వెతుక్కుని వస్తాను కానీ నువ్వు కొంచెం వంటిల్లు శుభ్రం చేయి" అంటూ క్రిందికి పరుగుతీసింది విజయ.

లలిత వంటింట్లోకి వెళ్ళింది.

క్రిందటి రోజు సాయంత్రం తరిగిన కూర పెచ్చులూ, మిగిలిపోయిన కాఫీ డికాక్షన్ అన్నీ గిన్నెలోకి ఎత్తి బాల్కనీ లోంచి వీధిలోకి విసిరేసి తిరిగి వచ్చింది. మరో నిముషంలో విజయ వగరుస్తూ పైకి పరుగెత్తుకు వచ్చింది.

ఒళ్ళంతా కాఫీ డికాషన్ మరకలు, నెత్తిమీద కూరచెక్కలతో "ఏమిటే..నువ్వు చేసిన పని?" అంటూ అరిచింది.

"క్రింద చూడకుండా విసిరానమ్మా..నీమీద పడినట్లుంది!" అంది లలిత భయంగా.

అప్పుడే బాత్రూంలోంచి వస్తున్న రామారావుకి ఆ దృశ్యం చూసేసరికి నవ్వు ఆగలేదు.

"అందుకే వీధిలోకి చెత్త విసరకూడదంటాను. ఇది నీకయింది కాబట్టి సరిపోయింది. ఇదే ఇంకెవరిమీద అయినా పడివుంటే పెద్ద గొడవైపోయి వుండేది" అన్నాడు.

విజయ ఏమీ మాట్లాడలేక బాత్రూం వైపు వెళ్ళిపోయింది.

"అమ్మా..ఉగ్గుగిన్నె వంటింటి మోరీలో దొరికింది" అంది లలిత.

"సరేలే..బట్టలు తీసుకురా!" అని బాత్రూంలోంచి అరిచింది విజయ.

**-కొచ్చెర్ల రమేష్ బాబు**
**(విజయవాడ)**